క్లుప్తంగా

కుండపోత వర్షం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగర, మండల వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు వర్షం పడింది. ఈ వర్షానికి కాలువలు పొంగి పొర్లాయి. చెరువులోకి నీరు సాగాయి. ఎండిపోయిన చెరువులు, కాలువల్లోని గుంతలు నిండుకున్నాయి. చిన్న చిన్న కాలువలు, చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. వేరుశనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

కాణిపాకంలో సీఈఓ



డైరెక్టర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం సీఈఓ, నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ తాడేపల్లి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి విష్ణు తదితరులు ఉన్నారు.

ప్రవేశాలకు ఆహ్వానం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని మురకంబట్టులో ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆహ్వానించనున్నట్లు ప్రిన్సిపల్ భార్గవి తెలిపారు. 5–8వ తరగతి వరకు చదివేందుకు మైనారిటీ విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

కన్నన్ కళాశాలలో మెరుగైన ఫలితాలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు బీఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం(అడ్వాన్స్‌డ్)లో మెరుగైన ఫలితాలు వచ్చినట్లు జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారి సయ్యద్‌మౌలా పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంపీసీలో 94 శాతం, బైపీసీలో 90 శాతం, సీఈసీలో 91 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో పదోతరగతి పాసైన విద్యార్థులను కన్నన్ కళాశాలలో చదివించాలని కోరారు.

వెలగని వీధి దీపాలు



అలంకారప్రాయంగా ఉన్న వీధిలైటు


తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లె కాలనీలో వీధిలైట్లు వెలగక అంధకారం అలుముకొంది. చీకటి పడితే వీధుల్లో తిరగలేక వృద్ధులు, పిల్లలు సైతం అవస్థలు పడుతున్నారు. కాలనీలో సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీధుల్లో లైట్లు వెలగకుండా అలంకారప్రాయంగా ఉన్నాయి. కాలనీవాసులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం రిపేరు చేశాం, మరలా చేయాలంటే తమ వల్ల కాదని పంచాయతీ కార్యదర్శి జాప్యం చేస్తున్నా రు. నెల రోజులుగా చీకటిలో బతుకులు వెళ్లదీస్తు న్నా పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్యం మెరుగుపరచాల్సి ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగించి, వీధులు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

గంగమ్మకు అంబళ్లు



ఇందిరమ్మకాలనీలో అమ్మవారికి అంబళ్లు సమర్పిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం గంగమ్మ జాతర ప్రారంభం అయ్యింది. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగించి నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని జలప్రవేశానికి తరలించనున్నట్లు తెలిపారు. మండలంలోని పాలేరు దళితవాడలో గంగమ్మ జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని మంగళవారం తెల్లవారు జామున కొలువుదీర్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



పాలేరు దళితవాడలో కొలువుదీరిన గంగమ్మ

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు





గొడుగుచింతలో నిల్వ ఉన్న నీటిపై మందు చల్లుతున్న ఆరోగ్య కార్యకర్తలు, బందివాండ్లవూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

- మలేరియాపై పోరాటం వేగవంతం
- 30వ తేదీ వరకు మాసోత్సవాలు

పూతలపట్టు/యాదమరి: ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధన కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేయడానికి ఆరోగ్య కార్యకర్తలు ప్రజల్లో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరిస్తున్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందులను స్ప్రే చేయాలని గ్రామీణ ప్రజలకు సూచిస్తున్నారు. గంబూసియా చేపలను వదలడం ద్వారా నీటిలోని లార్వాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు. ఇళ్లలోని గోడలపై సింథటిక్ పైరిత్రాయిడ్ (ఏసీఎం) అవసరాన్ని బట్టి దోమల మందులను స్ప్రే చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. దోమ తెరలు, దోమ చక్రాల ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు.

మలేరియా లక్షణాలు

అనాఫిలిస్ దోమల ద్వారా చలిజ్వరం వ్యాపిస్తుందని చెబుతున్నారు. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు క్రిముల వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందని పేర్కొంటున్నారు. దీనిలో వైవాక్స్ మలేరియా తక్కువ బాధిస్తే, పాల్సీఫారం మలేరియా ఎక్కువ బాధించడమే కాకుండా కొన్ని పరిస్థితుల్లో ప్రాణాంతక స్థాయికి చేరుతుందని విశ్లేషిస్తున్నారు. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయంటున్నారు. చిన్నపిల్లలు, గర్భిణులు దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రక్త పరీక్షల (బీయస్,ఆర్డీ టెస్ట్) ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చని పేర్కొంటున్నారు.

విస్తృతంగా కార్యక్రమాలు



మలేరియా వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అవగాహన ర్యాలీలు నిర్వహించడంతో పాటు ముంపునీరు నిల్వ ఉన్న ప్రాంతాలకు వెళ్లి ముంపునీటిని వెంటనే తొలగించాలని చెబుతున్నాం. దోమల నిర్మూలన మందు పిచికారీ చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపడుతున్నాం.

– లక్ష్మీనారాయణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, యాదమరి మండలం

పరిసరాల శుభ్రత పాటించాలి



మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే ఆడ దోమల వ్యాప్తి స్థానిక పరిస్థితులపై, పరిసరాల శుభ్రతపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. రక్త మార్పిడి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి.

– ప్రవీణ, మెడికల్ ఆఫీసర్, పూతలపట్టు

ఐటీఐలో ప్రవేశాలు

చిత్తూరు కార్పొరేషన్: ఐటీఐల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 20 నుంచి 22వరకు ప్రవేశాలు కల్పించనున్నట్లు స్థానిక ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి మంగళవారం తెలిపారు. 20వ తేదీ మెరిట్ ప్రకారం ఉదయం 1–100 వరకు, మధ్యాహ్నం 101–205, 21వతేదీ 206–350, తర్వాత 351–451 వరకు, 22వతేదీ ఉదయం 452–600, మధ్యాహ్నం 601–743 ప్రవేశాలు ఉంటాయన్నారు. అభ్యర్థుల తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐకి హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 77999 33370, 94936 29036ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా గంగజాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుడిపాల: మండల కేంద్రంలోని 189కొత్తపల్లె ఆది ఆంధ్రవాడలో మంగళవారం నిర్వహించిన గంగమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం మహిళలందరూ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలిపోసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పొంగలి పెట్టి రాత్రి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి పుర వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

మృగరాజుపై శ్రీరాముడి చిద్విలాసం



దేవస్థానంలో స్వామికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న ఉభయదారులు

- టి.పుత్తూరులో వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు
- నేడు హనుమ వాహన సేవ

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరాములు దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సింహ వాహనంపై శ్రీరాముడు విహరించారు. ఆలయంలో ఉదయం వేదపండితులచే సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామికి అభి షేకం, అలంకరణ, ప్రత్యేక పూ జలు నిర్వహించి ధూప దీపనైవేద్యం సమర్పించారు. ఉభయదారులు దొరస్వామి రెడ్డి కుటుంబసభ్యులచే భక్తితో స్వామికి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉభయదారులు ప్రసాద్‌రెడ్డిచే స్వామికి పాలాభిషేకం చే యించి మొక్కులు చెల్లించుకున్నా రు. సాయంత్రం ఉభయదారులు కోదండరెడ్డి ఆధ్వర్యంలో ఊంజల్ సేవను భక్తితో నిర్వహించారు.

సింహ వాహనంపై శ్రీరాముడి విహారం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఉభయదారులు తులసిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సింహ వాహన సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉభదారులు పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధ పరిమళ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న మృగరాజు వాహనంపై శ్రీరాముడు కొలువుదీరి పురవీధుల్లో ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



సింహ వాహనంపై విహరిస్తున్న కోదండరామస్వామి

నేడు హనుమంతు వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఉభయదారులచే స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రి హనుమంతు వాహన సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు.

చిత్తూరు కార్పొరేషన్‌లో అంతర్గత బదిలీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ అరుణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ అధికారిగా ఉన్న గోపాలకృష్ణ వర్మను మేనేజర్‌గా, అక్కడ పనిచేస్తున్న ఉమామహేశ్వర్ రెడ్డిని రెవెన్యూ అధికారిగా నియమించారు. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న తనూజాను టౌన్ ప్లానింగ్ విభాగానికి, అమరనాథ్ రెడ్డిని ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేశారు. దురై రాజును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, సురేష్ కుమార్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా, ప్రకాష్‌ను ప్రజారోగ్య విభాగానికి బదిలీ చేశారు.

ఇంటర్మీడియెట్‌లో 100 శాతం ఉత్తీర్ణత

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మంగళవారం సప్లిమెంటరీ ఫలితాలు విడుదల కావడంతో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలోనే 100శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాల బొమ్మసముద్రం జూనియర్ కాలేజీ అని చెప్పారు. 27మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ పాసైనట్లు తెలిపారు. కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి ప్రత్యేక శ్రద్ధతో ఉత్తీర్ణత చేయించి మంచి విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు.

20, 21న పరీక్షలు

నదుం: జిల్లాలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 20, 21 తేదీల్లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు కన్వీనర్ ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. 6, 8 తరగతులకు 20న, 7, 9 తరగతులకు 21న మధ్యాహ్నం 3 గంటల నుంచి పరీక్ష ప్రారంభం అవుతుందన్నారు. 3.10 గంటల తరువాత పరీక్ష కేంద్రానికి వచ్చే వారిని అనుమతించమని ఆయన చెప్పారు. హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 9885225352, 8790092069 నంబర్లను సంప్రదించాలన్నారు.

కొలువుదీరిన గంగమ్మ



అమ్మవారి దర్శనార్థం క్యూకట్టిన భక్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని న్యూ ప్రశాంత్‌నగర్‌లో మంగళవారం గంగజాతరను వేడుకగా ప్రారంభించారు. మండపంలో ఉదయం అమ్మవారి శిరస్సును కొలువుదీర్చారు. తెరను లాంఛనంగా ప్రారంభించి భక్తిశ్రద్ధలతో తొలిపూజ చేశారు. భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి అంబలి పోశారు. అనంతరం నిత్యపూజలు కొనసాగాయి. అమ్మవారి దర్శనార్థం భక్తులు క్యూకట్టారు. వచ్చిన భక్తులకు జాతర పెద్దలు పసుపు, కుంకుమం, ప్రసాదం అందజేశారు. పలువురు ప్రముఖులు అమ్మవారికి గజమాల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వీధినాటక ప్రదర్శన స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు రామచంద్ర, సౌందరరాజన్, శ్రీనివాసులు, రమేష్, విజయ్,ప్రకాష్, రాజా యాదవ్, అంజి, నరేష్‌కుమార్, శివక్రిష్ణ, వెంకటేష్, శేఖర్‌బాబు, జగదీష్, వీరయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



న్యూ ప్రశాంత్‌నగర్‌లో కొలువుదీరిన అమ్మవారు

కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్)ను నిర్వహించారు. కమిషనర్ అరుణ పాల్గొని, ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. ఇంజినీరింగ్‌కు సంబంధించి 4, ప్రధాన కార్యాలయానికి సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయి. ఇక నుంచి ప్రతీ సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రాధాన్యత వారీగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల వినతులు వింటున్న కమిషనర్ అరుణ

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

బంగారుపాళెం: బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని మండల అభివృద్ధి అధికారి శివశంకర్, తహసీల్దార్ సుభద్ర అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో మంగళవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు ఆయా గ్రామాల్లో పర్యటించి పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఎంఈఓ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, బడిబయట పిల్లల నమోదుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టిందని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల పరిధిలో హ్యాబిటేషన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీలో ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా, చైర్మన్‌గా పాఠశాల కమిటీ చైర్మన్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వలంటీర్ సభ్యులుగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కమిటీ సభ్యులు ఆయా గ్రామాల్లో పర్యటించి పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమం జూలై 15 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బడిఈడు పిల్లల నమోదు కార్యక్రమాన్ని పాఠశాలల్లో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 రమేష్‌బాబు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





తవణంపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, హాజరైన ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

తవణంపల్లె: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించి విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నట్లు వివరించారు. ఎంఈఓ హేమలత మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి జూలై 12వ తేదీ వరకు నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని వివరించారు. ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి మాట్లాడుతూ బడికి నిలిచిపోయిన వారిని తిరిగి బడిలో చేర్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. బడిబయట ఉన్న పిల్లలను సర్వే చేసి పాఠశాలలో నమోదు చేయించాలన్నారు. దీని కోసం మండల, పాఠశాల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్లాలని వివరించారు. సమావేశంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను గుర్తించాలి

గుడిపాల : బడిమానేసి బడిబయట ఉన్న పిల్లలను గుర్తించాలని ఎంఈవో రామ్‌నాయక్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 6–14 ఏళ్ల పిల్లలు బడిలోనే ఉండాలని, 100శాతం నమోదు సాధించాలని, అందుకు గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న నాడు–నేడు పనులను వెంటనే పూర్తిచేయాలని, స్టూడెంట్ కిట్‌లను ప్రతి ఒక్క విద్యార్థికీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



బంగారుపాళెం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివశంకర్



గుడిపాల : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రామ్‌నాయక్